www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 11 మే 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తాం..

ఏలూరు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూములకు పరిహారం అందిస్తాం

ఆక్వా రైతులను ఆదుకుంటాం

అంతా గెలుపే ధ్యేయంగా పని చేయాలని పిలుపు

హోంగార్డులకు వేతనం రూ.25 వేలకు పెంచుతామని హామీ

ఉండి, ఏలూరు ఎన్నికల సభల్లో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఏలూరు అర్బన్, సిటీ, కాళ్ల, ఉండి

పోలవరం నిర్వాసితులు భూములు, ఊళ్లు సైతం కోల్పోయారని, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూములకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని టిడిపి అధినేత చంద్రబాబు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరిలోని ఉండి, జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ఆయన పర్యటించారు. ఉదయం పది గంటలకు చంద్రబాబు ఉండి వస్తారని షెడ్యూల్ ఇచ్చినప్పటికీ 12.20 గంటలకు భీమవరం శివార్లలో నర్సింహపురం రోడ్డు సమీపంలోని విఎస్ఎస్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా ఉండి ప్రధాన సెంటర్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ముందుగా ఉండి టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రఘురామకృష్ణంరాజు, బిజెపి నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ తమను గెలిపించాలని కోరారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మూడు పార్టీల అజెండా మాత్రం ఒక్కటేనన్నారు. ఎంపీ రఘురామకృష్ణంరాజును వైసిపి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిందో మీకు తెలుసన్నారు. జగన్‌పై రఘురామ మామూలుగా పోరాటం చేయలేదన్నారు. రఘురామకు న్యాయం చేయడం కోసమే, సిట్టింగ్ ఎంఎల్ఎ రామరాజును కాదని, ఆయనకు టిక్కెట్ ఇచ్చామన్నారు. ఉండి నియోజకవర్గంలో ఆక్వా రంగం అభివృద్ధి టిడిపి హయాంలో జరిగిందన్నారు. ఆక్వా రైతులకు కరెంట్ యూనిట్ ధర రూ.1.50 పైసలకు అందించడంతో గణనీయంగా ఆక్వా ఉత్పత్తులు పెరిగాయన్నారు. ఉండి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాన్‌ను మళ్లీ తీసుకొస్తే మీకు ఉరి వేస్తాడన్నారు. అనంతరం ఒంటిగంట ప్రాంతంలో ఉండి నుంచి బయలుదేరి 1.45 గంటలకు ఏలూరు సిఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గం గుండా పన్నెండు పంపుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ముందుగా ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ మాట్లాడారు. ..6లో

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం ఆధ్వర్యాన భారీ ప్రదర్శన

అందరికీ మేలు 'ఇండియా'తోనే సాధ్యం

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలి

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపు

భారీ ప్రదర్శనకు తరలొచ్చిన కార్మికులు, ప్రజలు

ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

వామపక్షాలు అంటే ఎంతో గౌరవం

మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు

బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలకు గుణపాఠం చెప్పాలి

కాంగ్రెస్ నరసాపురం ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు

భీమవరం సభలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

దేశానికి, రాష్ట్రానికి మేలు జరగాలంటే ఇండియా వేదికతోనే సాధ్యమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ఇండియా వేదికలో భాగస్వాములైన సిపిఎం, సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి చట్టసభలకు పంపించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఎన్నికల్లో వేలకోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ప్రజానీకం ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా ఆలోచించి ఓటేయాలని చెప్పారు. ధరల నియంత్రణ, భూములు పరిరక్షణ, ప్రత్యేక హోదా విభజన హామీలు, పోలవరం నిర్మాణం, స్వేచ్ఛా స్వాతంత్రం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఇవన్నీ జరగాలంటే ఇండియా వేదిక అధికారంలోకి రావాలన్నారు. బిజెపి పంచన చంకలో ఉన్న టిడిపి, జనసేన, వైసిపిలను ఎన్నికల్లో ..6లో

నేటితో ప్రచారం బంద్

జిల్లాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం

మొత్తం 1744 పోలింగ్ స్టేషన్లు, 414 సమస్యాత్మక కేంద్రాలు

ఓటర్ స్లిప్పుల పంపిణీ దాదాపు పూర్తి

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

ఏలూరు ఎస్పి మేరీ ప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలింగ్‌కు 48 గంటల ముందు అంటే శనివారం సాయంత్రం ఆరు గంటలకు ఎన్నికల ప్రచారం నిలిపివేయాలని, తర్వాత రోజు పత్రికల్లో ప్రకటన ఇవ్వాలన్నా ఎంసిఎంసి అనుమతి తీసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం పోలింగ్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,744 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, మొత్తం 16.37 లక్షల మంది తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారన్నారు. ఈ నెల 13న ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పోలింగ్ బూత్‌కు వంద మీటర్ల పరిధిలోపు పోటీ చేసే అభ్యర్థులకు, పార్టీ ఏజెంట్లకు మినహా రాజకీయ పార్టీల వారికి ఎటువంటి అనుమతీ లేదన్నారు. పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురికి మించి వ్యక్తులు గుమిగూడితే కేసులు పెడతామన్నారు. జిల్లాలో ఇంతవరకు రూ.15 కోట్లు విలువైన ..6లో

గెలుపే లక్ష్యం.. అభివృద్ధే ధ్యేయం

మధ్యపేజీల్లో..

ఇండియా వేదికతోనే సమస్యలు పరిష్కారం

మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు

8లో..

నేడు కైకలూరులో జగన్ పర్యటన

ప్రజాశక్తి - కైకలూరు

సిఎం జగన్ శనివారం కైకలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12.30కు సిద్ధం పేరిట జరిగే సభలో ఆయన పాల్గొని మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

మద్యం దుకాణాలు కిటకిట

మద్యం షాప్ వద్ద క్యూ

ప్రజాశక్తి - నరసాపురం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాలని అధికారులు ఆదేశించడంతో ఆ దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 11వ తేదీ శనివారం సాయంత్రం ఏడు గంటలు నుండి 13వ తేదీ సాయంత్రం ఏడు గంటలు వరకూ దుకాణాల్లో మద్యం విక్రయాలు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో మద్యం ప్రియులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మద్యం దుకాణాల వద్ద మందుబాబులు బారులు తీరారు. రెండు రోజులకు అవసరమైన మద్యం ముందుగానే కొనుగోలు చేసి తీసుకెళ్లడం కన్పించింది. దీంతో కొన్ని దుకాణాల వద్ద బీర్లు లేవని బోర్డులు పెట్టడం గమనార్హం. బెల్ట్‌షాప్ నిర్వాహకులు పెద్దఎత్తున మద్యం కొనుగోలు చేసి తీసుకెళు ఒడటం కన్పించింది. పట్టణంలో 12 సీసాలు తీసుకెళ్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. నెల రోజులుగా మద్యం దుకాణాల్లో బీర్లు ఉండటం లేదని, బార్లలో మాత్రం అధిక ధరలకు లభ్యమవుతున్నాయని వాపోతున్నారు.

212 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి కృష్ణ

ఏలూరు టౌన్: ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు సంబంధించి ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 212 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఏలూరు నగర కమీషనర్ సంక్రాంతి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాలతో ఏలూరు నగరపాలక సంస్థలో 212 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని, పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఎలా ఉంటుందని ముందుగా ఒక నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. నగరపాలక సంస్థలో ముందస్తుగా ఓటర్స్ అవగాహనకు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయా పోలింగ్ కేంద్రాలను విజిట్ చేసి వారికి అవగాహన కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 4 పోలింగ్ కేంద్రాల్లో ఒకటైన ఆదర్శ పోలింగ్ కేంద్రం మెహర్ బాబా గుడి రోడ్డు, రెండవ పోలింగ్ కేంద్రం మహిళలచే నిర్వహించబడే పోలింగ్ కేంద్రాన్ని మనం అక్కడ నిర్వహించడం జరిగిందని తెలిపారు. మూడవ పోలింగ్ కేంద్రం మండల ప్రజా పరిషత్ ఎలిమెంటరీ స్కూల్లో యువతచే, నాలుగో పోలింగ్ కేంద్రం చోడుదిబ్బ పరిధిలోని నరసింహ ఎలిమెంటరీ హైస్కూల్లో విభిన్న ప్రతిభావంతులు నిర్వహించే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

144 సెక్షన్ అమలు..

ప్రజాశక్తి - కైకలూరు

ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 14 సాయంత్రం 6 గంటల వరకు కైకలూరు ప్రాంతంలో 144వ సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్ తెలిపారు. సమావేశాలు, బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించడం నిషేధం అన్నారు. జనం గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది సమూహంగా ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఎన్నికల అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జనసేనలోకి పలువురు

ప్రజాశక్తి - కామవరపుకోట

చింతలపూడి నియోజకవర్గ జనసేన కన్వీనర్ మేక ఈశ్వరయ్య ఆధ్వర్యంలో తడికలపూడిలో శుక్రవారం వైసిపి నుంచి జనసేనలోకి సుమారు 50 కుటుంబాల వారు చేరారు. వారందరూ టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్, ఏలూరు ఎంపీ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ల గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు బొబ్బిలి వీరబాబు, ఎస్‌కె వల్లి, టిడిపి నాయకులు తూతా లక్ష్మణ్ రావు, బొంతు వెంకటేశ్వరరావు, మెరుగు సుందర్రావు, శిరిగి బత్తుల నాగరాజు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా : రోషన్

ప్రజాశక్తి - కామవరపుకోట

సాయం అందిస్తున్న టిడిపి నాయకులు

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానని టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని శివారు తహశీల్దార్ కార్యాలయం సమీపంలో కొద్ది రోజుల క్రితం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఎస్.ఏసు, పండూరి రత్తయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. ఇరువురు కూడా ఆర్థిక స్తోమత లేనివారు. ఈ సంఘటనను మండల టిడిపి అధ్యక్షుడు కిలారి సత్య నారాయణ, స్థానిక వార్త విలేకరి కడిపి పాపారావు టిడిపి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయం చేసి తన సేవాగుణం చాటుకున్నారు. సదరు సొమ్మును గురువారం సాయంత్రం బాధితులకు అందజేశారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పుస్తకాలు అందజేస్తున్న గీతా నారాయణన్

జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన మాజీ సర్పంచి, కీర్తిశేషులు తల్లాడి సత్తిపండు కుమార్తె, విశాఖపట్టణం వాస్తవ్యులు గ్రీన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులైన గీతా నారాయణన్ స్థానిక శాఖా గ్రంథాలయానికి గ్రూప్-1, గ్రూప్-2, డిఎస్‌సి పోటీ పరీక్షల నిమిత్తం అవసరమయ్యే సుమారు రూ.27 వేల విలువైన 44 పుస్తకాలను స్థానిక గ్రంథాలయ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా మరిన్ని పుస్తకాలను భవిష్యత్‌లో అందిస్తామని తెలిపారు. ఐఎఎస్, ఐపిఎస్, తదితర 99 రకాల పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉచిత శిక్షణా కార్యక్రమం కూడా నిర్వహించే ఆలోచన ఉందని, త్వరలోనే దానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గీతా నారాయణన్ ఇటీవల జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో రూ.3 లక్షలతో తాగునీరు సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దుర్గారావు, ప్రముఖ కాలమిస్ట్ శ్రీనివాసరాజు, పలువురు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న వారు, గ్రంథాలయ పాఠకులు, గ్రామ పెద్దలు హాజరై దాత గీతా నారాయణ్ ఔదార్యాన్ని కొనియాడారు. ఆమె దాన గుణాన్ని అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టుకోవచ్చని, తద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా మొదలగు వ్యాధులను కొంతవరకు తగ్గించుకోవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూ చించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక వెంకటాపురం-6 సచివాలయం సాయినగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారం రోజులు పైబడి నీరు నిల్వ ఉన్నచోట దోమలు వృద్ధి చెందుతాయి, కాబట్టి వారానికి ఒకసారి దోమలు పెరిగే స్థలాలైన నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, పూల కుండీలు, ఫ్లవర్ వాసులు, రుబ్బు రోళ్ళు, ఎయిర్ కూలర్స్, ఫ్రిడ్జ్ వెనుక బాక్స్, దాబాపైన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రపరచుకొని మూతలు పెట్టుకోవాలని సూచించారు. దోమకాటు ఎవరికీ కనిపించనప్పటికీ అది చాలా ప్రమాదకరమని, దోమ కుట్టకుండా చూసుకోవాలని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధిక వేడి వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది కాబట్టి ప్రజలు ఎక్కువ ద్రవపదార్థాలైన కొబ్బరి బొండాలు, గ్లూకోజ్ వాటర్, ఓఆర్ఎస్ ద్రావణం, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. లేతరంగు కాటన్ దుస్తులు, తలకి టోపి, తలపాగా ధరించాలని, మధ్యాహ్నం 12 గంటలకు పనులు ముగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త తులసి, ఎంఎల్‌హెచ్‌పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లాంగ్ జంప్ గోడ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పున: ప్రారంభిస్తున్న గోడ నిర్మాణం

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న లాంగ్ జంప్ గోడ నిర్మాణం ఈనెల 7వ తేదీన కురిసిన వర్షానికి కుంగిపోయింది. ఈమేరకు ఈనెల 9వ తేదీన 'కుంగిపోయిన లాంగ్ జంప్ నిర్మాణం' అనే శీర్షికతో ప్రజాశక్తిలో వార్త వెలువడిన అంశం పాఠకులకు విధితమే. దీంతో స్పందించిన అధికారులు నిర్మాణ పనులను శుక్రవారం పున: ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు టి.చంద్రావతి గురువారం పాఠశాలకు చేరుకొని గోడ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్‌ను పిలిచి నీటిని బయటకు పోయేలా చూడాలని కోరారు. వెను వెంటనే పనులను ప్రారంభించి గోడ నిర్మాణాన్ని నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి, చుట్టూత మట్టి పోసి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

వైసిపి బలాన్ని చాటేందుకే ఆత్మీయ సమ్మేళనం

కుక్కునూరు: మండల పరిధిలోని వైసిపి నాయకులు, కార్యకర్తల బలాన్ని చాటి చెప్పేందుకే తాము ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వైసిపి మండల అధ్యక్షులు కుచ్చేర్లపాటి నరసింహరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుచ్చెర్లపాటి నరసింహారాజు ఇంటి వద్ద వైసిపి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులు వైసిపి ఏలూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీ పెద్దలు, చిన్నలు అందరూ ఒక చోట చేరి మంచి చెడ్డలు మాట్లాడుకుంటూ మన బలాన్ని చూపించుకోవాలనే ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల్లో వైసిపికి ఉన్న ఆదరణను చూసి జీర్ణించుకోలేని స్థితిలో టిడిపి, జనసేన, బిజెపి, ఇతర పార్టీలు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలూ దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మంచి జరిగితేనే మాకు ఓటు వెయ్యండని చెప్పే దమ్మున్న ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డేనని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ కుచ్చేర్లపాటి నరసింహారాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - చింతలపూడి

తెలంగాణ రాష్ట్రానికి చెందిన 10 మద్యం సీసాలను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కి తరలించడమైందని చింతలపూడి ఇన్స్‌పెక్టర్ డిఎస్ఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.రామకృష్ణ ఆదేశాల మేరకు చింతలపూడి సెబ్ సిబ్బంది మండలంలోని లింగగూడెం గ్రామం చెక్ పోస్టు వద్ద బట్టువారిగూడెం గ్రామానికి చెందిన బొడ్డేటి శ్రీనివాసరావు అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కామవరపుకోట మండలం కామవరపుకోట గ్రామంలో నన్నా సుధీర్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 155 ఆంధ్ర రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి తరలించడంమైంది. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి అతనికి చెందిన 500 లీటర్ల బెల్లపు ఓటను నేర స్థలంలో ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాయిని సీజ్ చేయడమైనదని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఆర్.మోహన్ రావు, పి.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

ఓ.ఎస్. నెం. 103/2018

Between:

Plaintiff: Chandakanna Rama Krishna

Vs

Defendants:

The Punjab National Bank, Rep. by its branch Manager, Palakol Branch, Palakol and Others

To:

Defendant No-3:

Javvaji Naga Venkata Satya Narasimharao, S/o. Venkateswara Rao, D.No. 13-4-9/C, Palakol, Palakol Mandal, W.G.Dist.,

పై నెంబర్ గ్రంథంలో మీకు ఎన్ని పర్యాయములు దావా సమనులు పంపినను మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున, ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి **ది. 17-05-2024న ఉదయం 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసిందిగా కోరుచున్నాను. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

డి.సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 9849173674

పాలకొల్లు
ది.10-05-2024

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P. No. 222/2023

పిటీషనరు:

Dhanukonda Geetha

రెస్పాండెంటు యొక్క అడ్రసు:

Dhanukonda Venkateswara Rao, S/o. D.Veeraju, D.No. 3-107, Post Office Road, Krovidi Village, Nidamarru Mandal, Eluru District, A.P.

పై నెంబరు పిటీషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు పుచ్చుకోకపోవుట చేత యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 03-07-2024వ తేదీ ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని, లేదా మీ యొక్క అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ యొక్క వాదనను తెలియజేసుకోవలెను. లేనిచో మీ పరోక్షమున H.M.O.P. తీర్మానింపబడునని తెలియజేయటమైనది.

SANA NAGA BABU
D.NAGA MADHAVI
పిటీషనరు తరపు న్యాయవాదులు
భీమవరం

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ (జూనియర్ డివిజన్) భీమవరం వారి కోర్టులో

ఐ.ఎ. నెం. 284/2023 ఇన్

ఓ.ఎస్. నెం. 115/2018

Between:

Petitioner/ Plaintiff: Godi Issac

Vs

Respondents/ Defendants:

Godi Krishna Murthy (died) and others

To:

R-6 Proposed Party/ Respondent No-6:

గోడి ఆనందరావు, S/o. లేటు కృష్ణమూర్తి, మత్స్యపురి గ్రామం, వీరవాసరం మండలం, భీమవరం జిల్లా.

పై నెంబర్ గ్రంథంలో 1వ రెస్పాండెంట్ చనిపోయినందున Proposed Party/ 6వ రెస్పాండెంట్ అయిన మిమ్ములను వారసులుగా చేర్చు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోకుండా కాలయాపన చేసినందున, ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. కాబట్టి **ది. 15-05-2024న ఉదయం 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసిందిగా కోరుచున్నాను. లేనిచో పై దావా మీ పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

డి.సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 9849173674

పాలకొల్లు
ది.10-05-2024

అక్షయ తృతీయపై ఎన్నికల ప్రభావం

ప్రజాశక్తి - నరసాపురం

అక్షయ తృతీయ రోజున బంగారం కొంటే శుభం కలుగుతుందని ప్రజలు నమ్ముతారు. ఆర్థిక స్తోమత లేకపోయినప్పటికీ ఎంతో కొంత చిన్న బంగారు ముక్కైనా, వస్తువైనా ఆనవాయితీగా కొనుగోలు చేస్తారు. అక్షయ తృతీయకు ఎన్నికల ప్రభావం చూపింది. ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేలు మించి తీసుకెళ్లరాదని, అలా తీసుకెళ్తే స్వాధీనం చేసుకుని కేసులు పెడతామని అధికారులు చెప్పారు. దీంతో డబ్బులు తీసుకెళ్తే స్వాధీనపరుచుకుంటారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం అక్షయ తతీయ అయినప్పటికీ బంగారం కొనుగోలు చేసేందుకు డబ్బుతో రావాలంటే ప్రజలు భయపడ్డారు. ఇప్పటికే బంగారం, వెండి ధరలు భారీగా పెరగడంతో వ్యాపారాలు మందగించాయని వ్యాపారులు తెలుపుతున్నారు. అక్షయ తృతీయ పురస్కరించుకుని



నరసాపురంలో ఓ బంగారు దుకాణం

వినియోగదారుల అవసరార్థం నరసాపురంలోని బంగారు దుకాణంలో వివిధ రకాల నమూనాలను వ్యాపారులు అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. నరసాపురంలో సుమారు 150 పైబడి బంగారు దుకాణాలు ఉంటాయి. నిత్యం రూ.కోట్లకు పైబడి అమ్మకాలు సాగుతాయి. పశ్చిమ గోదావరితో పాటుగా తూర్పు గోదావరి కృష్ణా జిల్లాల నుంచి ఇక్కడకి బంగారం కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం ఎన్నికల ప్రభావం వల్ల పెద్దగా వ్యాపారాలు సాగలేదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతి ఏడాది అక్షయ తృతీయ వస్తుందంటే కొన్నిరోజుల ముందు నుంచే దుకాణాల్లో సందడి ఉండేదని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేదని, ఎన్నికల నేపథ్యంలో డబ్బు తరలించకూడదని నియమాలు ఉండడంతో ప్రజలు కొనుగోలు చేసేందుకు భయపడుతున్నారని పలువురు వ్యాపారులు తెలిపారు. వ్యాపారాలు తగ్గిపోవడానికి బంగారం ధర పెరగడం, పెళ్లిళ్ల సీజన్ ముగిసిపోవడం, ఎన్నికల ప్రభావమే కారణమని వ్యాపారులు తెలుపుతున్నారు. నరసాపురం బులియన్ మార్కెట్‌లో శుక్రవారం ధరలు ఇలా ఉన్నాయి. 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాములు 73,500, 22 క్యారెట్ల 91.6 కెడిఎం బంగారం 10 గ్రాములు ధర రూ.67,500, వెండి కేజీ రూ.84,700గా ఉంది.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారం

ప్రజాశక్తి - కలిదిండి

రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో భాస్కరరావుపేట, గుర్వాయి పాలెం, కలిదిండి, సానారుద్రవరం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ పదేళ్ల బిజెపి ప్రభుత్వ పాలనలో దేశంలోని రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సామాన్య ప్రజలను దోచుకుని, ఆ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టారన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న బిజెపికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. బిజెపితో జట్టు కట్టిన టిడిపి, జనసేనను, బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలన్నారు. కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను, కైకలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వీరవల్లి భాస్కరరావు, కుడిపూడి శ్రీనివాసరావు, జక్కుల మహేష్, గద్దె అనిల్‌కుమార్, పెరుమాళ్ల సత్యనారాయణ, ముంగం సురేష్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి, నేతలు

బిసిలకు జగన్ పెద్దపీట

వైసిపి ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు పెద్దపీట వేసిన వ్యక్తి సిఎం జగన్ అని వైసిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ అన్నారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి సూరిబాబు ఆధ్వర్యంలో బిసిల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల సిఎం జగన్ పరిపాలనలతో బిసిల జీవన స్థితిగతులు మారాయన్నారు. ఏలూరు పార్లమెంట్ చరిత్రలో బిసిలకు సీటు కేటాయించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజాసమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. బిసిలందరూ ఒక తాటిపై ఉంటూ జగన్‌కి అండగా ఉండాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మిని, తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, రాష్ట్ర గౌడ్ సంఘం అధ్యక్షులు చలమోలు అశోక్ గౌడ్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరుముచ్చు గోపాల్‌యాదవ్, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవుడు వెంకటరమణ, జెట్టి గురునాథరావు, కొల్లేరు సంఘ నాయకులు మోరు రామరాజు, వాసిరెడ్డి మధు పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే రాష్ట్రాభివృద్ధి

కాంగ్రెస్ తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి కడలి రామారావు

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో ఇండయా వేదికను గెలిపించాలని కాంగ్రెస్ తణుకు ఎంఎల్‌ఎ అభ్యర్థి కడలి రామారావు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని వ్యాపార సంస్థలు, షాపుల వద్దకు వెళ్లి ఆయన ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు వైసిపి ఐదేళ్ల కాలంలో ఏ విధంగానూ మేలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఎంఎల్‌ఎగా గెలిపించాలని కోరారు. ఇండియా వేదిక అధికారంలోకొస్తే ఇల్లు లేని పేదలకు రూ.ఐదు లక్షలతో ఇల్లు కట్టించి ఇస్తామన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.400 కనీస వేతనం అమలు చేస్తామన్నారు. కేంద్రంలో



ప్రచారంలో కడలి రామారావు

మళ్లీ బిజెపి అధికారంలోకొస్తే ఏ ఒక్క సంస్థ కూడా ప్రభుత్వ రంగంలో మిగలకుండా ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీ చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. రైల్వే, విద్యుత్, విమానాశ్రయాలు, ఆయిల్, గ్యాస్ వంటివి ప్రయివేట్ కంపెనీలకు ధారాదత్తం అవుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దిరిసిపో రామకృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పని చేశానని, పని చేస్తున్నానని భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన మోటార్‌సైకిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఎంఎల్‌ఎ పదవిని ఒక బాధ్యతగా తీసుకుని పని చేశానని, నిత్యం ప్రజలకు అందుబాటులోనే ఉన్నానని చెప్పారు. నియోజకవర్గంలో 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి 2024 వరకు తాను చేసిన అభివృద్ధి పనులు ఒక ల్యాండ్ మార్క్‌గా కనిపిస్తున్నాయ న్నారు. రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా భీమవరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మంత్రి పదవిని సైతం వదులుకుని జిల్లా కేంద్రాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం రైల్వే అండర్ టన్నెల్స్‌ను కేంద్ర రైల్వే సహకారంతో నిర్మించినట్లు చెప్పారు. సిఎం జగన్ ప్రతి కుటుంబానికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు మేలు జరిగే విధంగా పథకాలను అమలు చేశార న్నారు. రానున్న ఎన్నికల్లో నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమా బాలను, ఎంఎల్‌ఎ అభ్యర్థి తనను గెలిపించాలని కోరారు.



ప్రచారంలో సిపిఐ నాయకులు

'రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిన మోడీ'

ప్రజాశక్తి - కామవరపుకోట

కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అన్ని విధాలుగా అన్యాయం చేసిందని సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్.రాజు అన్నారు. మండలంలోని పాతూరు గ్రామంలో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పదేళ్లపాటు ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోడి అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు చూస్తున్నారన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడిని, రాష్ట్రంలో టిడిపి కూటమిని, వైసిపిని ఓడించాలన్నారు. ఇండియా వేదికను అధికారంలోకి తీసుకురావడం ద్వారా దేశంలో, రాష్ట్రంలో గత వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో గ్రామాలన్నీ నిర్వీర్యం

జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో వైసిపి పాలనలో గ్రామాలన్నీ నిర్వీర్యం అయిపోయాయని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడాలన్నా టిడిపి కూటమి అధికారంలోకి రావాలని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రామన్నగూడెం, జగ్గన్నపేట, కడియద్ద, కృష్ణాపురం, నీలాద్రిపురం, నవాబుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ వైసిపి తన స్వార్థ ప్రయోజనాల కోసం ఇటు పంచాయతీల వ్యవస్థను, గ్రామాల అభివృద్ధిని నీరు గార్చిందని, మూడేళ్ల సర్పంచుల పాలనలో వారు ఏమీ చేయలేకపోయారన్నారు. 2014లో టిడిపి హయాంలో గ్రామాల్లో విప్లవాత్మకంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ నిర్మించామన్నారు. అదే



ప్రచారంలో బొలిశెట్టి శ్రీనివాస్

తరహా అభివృద్ధి కొనసాగాలంటే టిడిపి కూటమి అధికారంలోకి రావడం అవసరమని, ప్రజలు అదే కోరుకుంటున్నారన్నారు.

టిడిపి కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి కూటమి సిద్ధాంతాల వల్లే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్రంలోని అన్ని తరగతుల ప్రజలు విశ్వసిస్తున్నారని జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని బొలిశెట్టి నివాసం వద్ద నల్లజర్ల మండలం సింగరాజుపాలేనికి చెందిన వైసిపి నాయకులు అచ్యుత సత్యనారాయణ, దొండపాటి బాబు, గారపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ త్యాగం గుర్తించి నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలనుకున్న ప్రతిఒక్కరూ జనసేన పార్టీకి ఆకర్షితులవుతున్నారన్నారు.

నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతా

కంభం విజయరాజు

ప్రజాశక్తి - కామవరపుకోట

నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దటానికి తాను కట్టుబడి ఉన్నానని వైసిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభర్థి కంభం విజయరాజు అన్నారు. కామవరపుకోటలోని వైసిపి కార్యాలయంలో గురువారం రాత్రి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టిడిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి సొంగ రోషన్‌కుమార్, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి రహస్య పొత్తు పెట్టుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

రాయన్నపాలెంలో కొఠారు ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గత ఐదేళ్లలో రాయన్నపాలెం రూపు రేఖలు మార్చానని, ఇంకా చాలా అభివృద్ధి పనులు చేస్తానని వైసిపి దెందులూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి చెప్పారు. రాయన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం అయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ నియోజకవర్గంలో మరింత మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్లు ఇస్తానని చెప్పారు. టిడిపి కూటమి మాయమాటలు ప్రజలు నమ్మడం లేదని రోజుకో కొత్త అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. పేదలకు సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను గెలిపించాలని కోరారు. అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.



ప్రచారంలో కొఠారు అబ్బయ్యచౌదరి

జంగారెడ్డిగూడెంలో రోషన్‌కుమార్ ర్యాలీ

ప్రచారంలో సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పట్టణంలో టిడిపి చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ఏలూరు రోడ్డులోని టిడిపి నాయకుడు పరిమి సత్తిపండు ఇంటి నుంచి, నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా బయలుదేరి ప్రచారం నిర్వహించారు. అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌ను కూడా అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారుల వెంట నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించుకుంటూ ప్రచారాన్ని కొనసాగిస్తూ ఆలపాటి గంగాభవాని ఫంక్షన్ హాల్ వరకూ సాగించారు.

కాంగ్రెస్‌తోనే దేశ రక్షణ

రోడ్ షోలో పాతపాటి హరికుమార్ రాజు

ప్రచారం చేస్తున్న పాతపాటి హరికుమార్‌రాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్‌రాజును గెలిపించాలని కోరుతూ సిపిఎం, కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం ఉంగుటూరులో రోడ్ నిర్వహించారు. ఎన్‌డిఎ కూటమితో రైతులు, కర్షకులు, ప్రజానీకం తీవ్రంగా నష్టపోవడం ఖాయమని, ఇండియా కూటమితోనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. దేశాన్ని రక్షించుకోవడం కోసం నియంతపాలక పార్టీ బిజెపిని సాగనంపాలన్నారు. రైతులు, కౌలుదారులు హరికుమారాజుకు మద్దతు పలికారు. ప్రచారంలో సిపిఎం నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు యర్రంశెట్టి సాయి నాగబాబు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నారపల్లి రమణారావు, పెంటారావు, వి.వెంకటేశ్వర్లు, ఆర్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుల ఇంట్లో రోషన్‌కుమార్ భోజనం

వృద్ధ దంపతుల ఇంట్లో భోజనం చేస్తున్న రోషన్‌కుమార్

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని ఆడమిల్లి గ్రామ పంచాయతీలో కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య టిడిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పుట్టినరోజు వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా ఆడమిల్లి గ్రామం చేరుకున్న ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలు, తీన్మార్ బ్యాండ్‌తో గ్రామంలోకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 25 కేజీల భారీ కేక్‌కట్ చేశారు. అనంతరం తానేటి.సుబ్బారావు, గంగమ్మ వృద్ధ దంపతుల చిన్న పురిపాకలో ఒక సామాన్య వ్యక్తిలా నేలమీద కూర్చుని భోజనం చేశారు. ఈ సందర్భంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రజలు ఎన్నికల ముందు ప్రచారం చేస్తున్నట్లు కాకుండా ఎన్నికైన తర్వాత జరుపుకునే విజయోత్సవంలా బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఆడమిల్లి గ్రామంలో చూపిన అపూర్వ ఆదరణే దీనికి నిదర్శనమన్నారు. సర్పంచి గూడపాటి కేశవరావు మాట్లాడుతూ రోషన్‌కుమార్ పదవి లేకుండా ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవలందించారని శాసనసభ్యునిగా గెలుపొందాక ఈ నియోజకవర్గాన్ని సర్వతో ముఖాభివృద్ధి చెందేలా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. చింతలపూడి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బాబ్జి మాట్లాడుతూ రోషన్ కుమార్ ఎటువంటి భేషజాలు లేని వ్యక్తి అన్నారు. అందరిలో ఒకరిగా కలిసిపోతూ మన్ననలు అందుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆడమిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు యలమర్తి రాంబాబు, తూతా లక్ష్మణరావు, మద్దిపాటి శ్రీను, నల్లమిల్లి భుజంగరావు, తూంపాటి అబ్రహం, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి

టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి రాధాకృష్ణ

ప్రచారం చేస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకురూరల్

అభివృద్ధి, సంక్షేమం టిడిపి కూటమితోనే సాధ్యమని టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు మండలం కొమరవరం, మహాలక్ష్మీచెరువు, వేల్పూరు గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి కూటమికి మద్దతివ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ అన్ని వర్గాలకూ, ప్రాంతాలకూ న్యాయం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. బిసిలకు రక్షణ చట్టం తేవడంతో పాటు 50 సంవత్సరాలకే పెన్షన్ కల్పిస్తున్నట్లు తెలిపారు. పింఛన్ రూ.4 వేలు పెంచడంతో పాటు ప్రతి ఇంటికీ పంపించినట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మెగా డిఎస్‌సి నోటిఫికేషన్లు వస్తాయని హామీ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ సమర్థవంతంగా అమలు చేస్తామని, మైనార్టీ సోదరులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలియజేశారు. రైతులకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 జమ చేస్తామని, బడి పిల్లల కోసం తల్లి అకౌంట్లో ఏడాదికి రూ.15 వేలు జమ చేస్తామని, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారు. యువత, రైతులు, వృద్ధులు, మహిళలు ఆలోచించి విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న 15,615 మంది

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో 15,615 మంది ప్రభుత్వ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 9వ తేదీ వరకూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఇతర అత్యవసర సేవలకు చెందిన శాఖల సిబ్బందికి అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1,614 మంది, దెందులూరు నియోజకవర్గంలో 2,165 మంది, ఏలూరులో 3,123 మంది, పోలవరంలో 2,872 మంది, చింతలపూడిలో 2,267 మంది, నూజివీడులో 1,923 మంది, కైకలూరు నియోజకవర్గంలో 1,651 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు.

గెలుపే లక్ష్యం.. అభివృద్ధే ధ్యేయం..

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణ, ప్రత్యేక రైల్వేజోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, రాష్ట్ర రాజధాని నిర్మాణం, పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లింపు, ప్రాజెక్టు నిర్మాణం, చింతలపూడి ఎత్తిపోతల పథకం సమస్య పరిష్కారం తదితర అంశాలతోపాటు ప్రజల దైనందిన సమస్యలు పరిష్కారం కావాలంటే సార్వత్రిక ఎన్నికల్లో తమను గెలిపించాలని ఇండియా వేదిక అభ్యర్థులు కోరుతున్నారు. ఇండియా వేదిక బలపర్చిన సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులు ఏలూరు జిల్లాలోని ఏలూరు ఎంపీ స్థానంతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ బరిలో ఉన్నారు. ఇప్పటికే ముమ్మర ప్రచారం నిర్వహించిన ఆయా అభ్యర్థులు తమను ఎందుకు గెలిపించాలంటున్నారో వారి మాటల్లోనే..

ఫోకస్

సమస్యల పరిష్కారానికి 25 ఏళ్లుగా కృషి

సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు



ఏలూరు అర్బన్ : ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి జరిగే ప్రతి ఆందోళనలో, కార్మిక, ఉద్యోగ పక్షపాతిగా 25 ఏళ్లుగా పని చేస్తున్నాను. మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల కోసం గత 20 సంవత్సరాలుగా పోరాడుతూనే ఉన్నాను. పోరాటాల ద్వారా అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ఇండియా వేదిక తరపున ఏలూరు సిపిఐ ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను. ప్రస్తుతం దేశంలో మతోన్మాద రాజకీయాలు నడుస్తున్నాయి. అలాగే రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, నిర్వాసితుల సమస్యల పరిష్కారం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం, నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చి పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉంచడం, రైతులకు, ప్రజలకు నష్టం వాటిల్లే 2023 భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు, రైతులకు గిట్టుబాటు ధర వంటివి రావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉంది. నగరంలో అనేక సంవత్సరాలుగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. నగర పాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామ పంచాయతీలకు సంబంధించి తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక సమస్యల పరిష్కారానికి నోచుకోలేదు. సమస్యల పరిష్కారంతోపాటు ఐదేళ్ల క్రితం పోణంగి రోడ్డులో నిర్మించిన టిడ్కో ఇళ్లను వాస్తవ లబ్ధిదారులకు అప్పగించేందుకు, ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి, ఏలూరు కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలూ అందుబాటులో ఉండేలా కృషి చేస్తాం. మూతపడిన కొత్తూరు జ్యూట్ మిల్ తెరిపించి కార్మికులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాను. నగరంలో విలీనమైన పంచాయతీ గ్రామ ప్రజలకు ఉపాధి హామీ పనులు పునరుద్ధరించేందుకు కృషి చేస్తాను. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను. కంకి కొడవలి గుర్తుపై ఓటేసి నన్ను గెలిపించండి.

దెందులూరు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

ఎంఎల్ఎ అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తి



దెందులూరు : ఏళ్లుగా వెనుకబాటుకు గురవుతున్న దెందులూరు సమగ్రాభివృద్ధికి కృషి చేస్తాను. నియోజకవర్గ ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపించాలి. తాను గెలిస్తే దెందులూరును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. దెందులూరులో ఏళ్లుగా టిడిపి పాగా వేసింది. ఐదేళ్లుగా వైసిపి ఎంఎల్ఎ అధికారంలో ఉన్నారు. అయితే అవినీతి, అశ్రిత పక్షపాతం, గనులు, మట్టి, ఇసుక, భూముల కబ్జాలతో తీవ్ర దోపిడీకి గురైంది. మెట్ట, డెల్టా కలగలిసిన ఈ నియోజకవర్గంలో అనేక సహజ వనరులు ఉన్నాయి. ఇక్కడి భూముల్లో కొబ్బరి, పామాయిల్, కోకో, అరటి, మామిడి, జామ, కూరగాయలు వంటి వాణిజ్య పంటలు విస్తృతంగా పండుతాయి. కోకో, పామాయిల్, నిమ్మ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. బంగారం పండే చోట ప్రజలు మాత్రం అసౌకర్యాలు, అభివృద్ధి లేమి, పేదరికం అనుభవించాల్సి వస్తోంది. ప్రపంచ యుద్ధకాలంలో విమానాశ్రయ రన్‌వే కూడా ఉండేది. ఇప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. వైసిపి, టిడిపి వంటి పార్టీల నాయకుల ధనదాహమే ఈ పరిస్థితికి కారణం. ఇలాంటి దశలో కాంగ్రెస్ అవసరం ఎంతో ఉంది. ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పరిశ్రమిస్తున్నాను. నేను గెలిస్తే తమ్మిలేరుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తాను. పామాయిల్ రెండో ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించేందుకు కృషి చేస్తాను. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ చేపట్టి రహదారి సౌకర్యం మెరుగు పరుస్తాను. కొల్లేరు ప్రజలకు పరిష్కారం లభించేలా, ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కృషి చేస్తాను.

నిజయోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా..

నూజివీడు అభ్యర్థి మరీదు కృష్ణ



ముసునూరు : నిత్యం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటాను. ఎన్నికల ప్రచార సమయంలో నియోజకవర్గంలోని నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల ప్రజల సమస్యలు తెలుసుకున్నాను. ఆయా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ నూజివీడులోనే ఉంటూ స్థానిక నేతగా నూజివీడు అభివృద్ధికి దోహదపడతాను. అంతర్గత రోడ్ల అభివృద్ధి, అంతర్గత డ్రెయినేజీ ఏర్పాటు చేయడం, గెలిచిన వెంటనే టిడ్కో గృహాలు ఇచ్చే విధంగా చర్యలు చేపడతాను. అదేవిధంగా ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల రైతులు చిరకాల కోరిక చింతలపూడి ఎత్తిపోతల పథకం నా హయాంలో పూర్తి చేస్తాను. నూజివీడు పట్టణానికి రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడం, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా నాలుగు మండలాల్లోని ప్రభుత్వ భూముల్లో అత్యధిక పరిశ్రమలు తీసుకొచ్చే విధంగా కేంద్రంతో పోట్లాడి మరీ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాను. సిపిఎం, సిపిఐ మద్దతుతో ఎన్నికల సమరంలో నిల్చున్న నన్ను గెలిపించాలి.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజా



చింతలపూడి : కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.రెండు లక్షలు రుణమాఫీ చేస్తుంది. ప్రతి కుటుంబంలో మహిళకు నెలకు రూ.8,033 కాంగ్రెస్ అందిస్తుంది. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.400 అందిస్తుంది. పేదలకు రూ.5 లక్షలతో గృహ నిర్మాణాలు చేపడుతుంది. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పింఛను ఇస్తుంది. హస్తం గుర్తుపై ఓటు వేసి నన్ను గెలిపించండి.

అధికారంలోకి వస్తే రక్షిత నీటి సౌకర్యం

ఉంగుటూరు ఎంఎల్ఎ అభ్యర్థి పాతపాటి హరికుమార్ రాజు

ఉంగుటూరు : ఆక్వా ఆధారిత పరిశ్రమల వ్యర్థాల వల్ల చెరువులు, భూగర్భ జలాలు కలుషితమై కేన్సర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. తాము అధికారంలోకి వస్తే రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తాను. ఓటర్లు ఎన్‌డిఎ కూటమిని, వైసిపిని నమ్మడం లేదు. బిజెపితో అంటకాగిన పార్టీల పట్ల ప్రజలు వ్యతిరేకతతోనే తాము గెలుస్తాం. గణపవరం మండలంలో నీటి కాలుష్యం వల్ల అనేక వ్యాధుల బారిన పడుతున్న వారిని ఆదుకునేలా ప్రతి గ్రామానికీ ఆర్ఓ ప్లాంటును నిర్మించేందుకు కృషి చేస్తాను. నియోజకవర్గంలో అన్ని వర్గాల వారీగా సర్వే చేయించాం. ప్రజలంతా మార్పును కోరుకుంటున్నారు. వామపక్షాలు, కార్మిక, కర్షక, ప్రజా పోరాటాల సంఘాలు, ఉద్యోగులు, అసంఘటిత రంగ ప్రజల ఆదరణ మా ఎన్నికల ప్రచారంలో కనిపించాయి. ప్రతి ఓటరునూ కలిసి కాంగ్రెస్‌నే ఎందుకు గెలిపించాలనే అంశంపై చేసిన ప్రచారం తప్పకుండా ఫలితం ఉంటుంది.

సమగ్రాభివృద్ధే లక్ష్యం..

కైకలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్

కైకలూరు : కైకలూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాను. గత కొంతకాలంగా రాజకీయాల్లో ఉంటూ గ్రామాల్లోని ప్రజలకు సేవలందిస్తున్నాను. ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. తనను ఎంఎల్ఎగా గెలిపిస్తే కైకలూరును జిల్లాలోనే అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతాను. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు గతంలో విజయం సాధించి ఏం ఒరగబెట్టారు. నేటికీ గ్రామాల్లో మౌలిక వసతుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి సమస్యతో రోజుల తరబడి ప్రజలు సహజీవనం చేస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ప్రధాన రహదారుల సంగతి దేవుడెరుగు, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. నేను ఎంఎల్ఎ అయిన వెంటనే విద్యుత్ సమస్య పరిష్కారంతో పాటు అంతర్గత రోడ్లను నిర్మిస్తాను. అంతేకాకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పిస్తాను. కొల్లేరు గ్రామాల్లో సమస్యలతో పాటు దళితవాడలోని ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తాను. కైకలూరు పట్టణంలో ఎప్పటి నుంచో పరిష్కారానికి నోచుకోని అంబేద్కర్ భవన నిర్మాణం, పార్కుల నిర్మాణం చేయిస్తాను. కలిదిండి మండలంలోని శివారు ప్రాంతాలకు సాగునీటిని సరఫరా చేస్తాను. వైద్య సేవలు మరింత విస్తృత పర్చే చర్యలు తీసుకుంటాను. నిరుద్యోగులకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి అన్ని రకాలుగా సేవలందిస్తాను.

నిర్వాసితుల సమస్యలపై పోరాడతా

పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వెల సృజన

టి.నరసాపురం : పోలవరం నిర్వాసితుల సమస్యలపై పోరాడతాను. వారిపై ఎటువంటి భారాలు లేకుండా పూర్తి పరిహారం అందేలా చూస్తాను. అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర సహాయం తీసుకొని పూర్తి చేయడానికి కృషి చేస్తాను. అదేవిధంగా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రత్యేక హోదా కల్పిస్తానని రాహుల్ గాంధీ తెలిపారు. అంతేగాక నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీ నిర్మాణానికి కృషి చేస్తాను. ప్రతి పంచాయతీలో మహిళలకు, పురుషులకు 20 మందికి ఉద్యోగాలు కల్పిస్తాం. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. ప్రతి మండలంలో కార్మికులకు కమిటీ భవనాలు నిర్మిస్తాం. నియోజకవర్గ స్థాయిలో క్రీడా స్టేడియం నిర్మిస్తాం. ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేస్తాం. ప్రతి మండలంలో శ్మశానవాటికలు, సమావేశ భవనాలు నిర్మిస్తాం.

నన్ను గెలిపించండి

కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి లావణ్య

ప్రచారం చేస్తున్న కావూరి లావణ్య

ప్రజాశక్తి - చింతలపూడి

ఎపికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, పరిశ్రమలు అన్నింటికీ కాంగ్రెస్ సహకరిస్తుందని కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య అన్నారు. మండలంలో కావూరి లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో లింగపాలెం, చింతలపూడి, ఎర్రగుంటపల్లి, సీతానగరం, రాఘవాపురం, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కావూరి లావణ్య మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉంటే రాష్ట్రాల అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజీవ్ గాంధీ ప్రధానిమంత్రి అవుతారని, వెంటనే మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని, హోదా ఇచ్చిన మరుక్షణం మన రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తుందని తెలిపారు. యువతకు ఉపాధి దొరుకుతుందని, పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకం, రాజధాని, ప్రత్యేక హోదా, అలాగే ప్రభుత్వ రంగ సంస్థలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి అందరం బిజెపిని గద్దె దించాలని, కాంగ్రెస్ పరిపాలనకు సహకరించాలని తెలిపారు. కాంగెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా తనను గెలించాలని కోరారు. ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన కరపత్రాల పంపిణీ


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

నూజివీడు నియోజకవర్గ ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి మరీదు కృష్ణ, ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను గెలిపించాలని సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని ఆగిరిపల్లి, నెక్కలం, గొల్లగూడెం, ఈదులగూడెం గ్రామాల్లో కరపత్రాలను, బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, నాయకులు సత్తు కోటేశ్వరరావు, ముత్యాల నరేష్, రవీంద్ర, సుభాకర్, స్టాలిన్ పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే సమస్యలు పరిష్కారం

సిపిఎం బలపర్చిన సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

ఇండియా వేదికతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని, ఇండియా వేదిక బలపర్చిన జిల్లాలోని సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను జల సమాధి చేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పునరావాసం తమకు సంబంధం లేదని ప్రకటించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన హామీలు గాలికొదిలేశాయన్నారు. పోడు భూముల చట్టాన్ని సవరించి నిర్వీర్యం చేశారన్నారు. కొల్లేరు సమస్యను పరిష్కరించకుండా అక్కడి ప్రజలకు ఉపాధి లేకుండా చేశారని, రెగ్యులేటర్ల నిర్మాణం పక్కన పెట్టేశారని ఆందోళన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరేలా చేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా దగా చేసిన బిజెపి ఓట్లు అడగడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రానికి బిజెపి తీరని అన్యాయం చేస్తున్నా కనీసం మాట్లాడని టిడిపి, జనసేన మళ్లీ తిరిగి బిజెపితో పొత్తు పెట్టుకోవడం అత్యంత దారుణమన్నారు. అధికార వైసిపి కూడా బిజెపి విధానాలను అమలు చేస్తూ దానికి అనుకూలంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆ పార్టీలను తరిమికొట్టాలన్నారు. ఇండియా వేదిక గెలుపుతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని మోడీ సర్కార్ దెబ్బతీసిందన్నారు. జిల్లాలో వరితోపాటు పామాయిల్, పొగాకు తదితర పంటల రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే జిల్లాలో బరిలో ఉన్న సిపిఐ, కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలని, ఆ విధంగా అందరూ సహకరించాలని కోరారు.

ప్రచారంలో ఆళ్లనాని

చంద్రబాబుకు, పవన్‌కు గుణపాఠం చెప్పాలి

వైసిపి ఏలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సంక్షేమాన్ని ధ్వంసం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని వైసిపి ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి ఆళ్ల నాని ప్రజలకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇడా ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెన్నవల్లి వారి పేటలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద శుక్రవారం బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆళ్ల నాని మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాన నిలిచి పోరాడుతున్నారని, పెత్తందారుల తరపున చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పోరాడుతున్నారని చెప్పారు.

పలు గ్రామాల్లో పార్థసారథి ప్రచారం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మంకొల్లు, సోమవరం గ్రామాల్లో టిడిపి నూజివీడు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు పరిపాలనా కాలంలో గహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఒక్క రూపాయి బిల్లు పడి ఆగిపోయినవారికి టిడిపి కూటమి ప్రభుత్వం రాగానే చెల్లిస్తామని చెప్పారు. ఎవరూ భయపడొద్దని, రానున్నది టిడిపి కూటమిన ప్రభుత్వమేనని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. వైఎస్ఆర్ చేయూత ద్వారా 45 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.18,500 ఇస్తున్నామని మాయమాటలు చెబుతున్నారని, నూటికి పదిమందికి ఇచ్చి 90 మందికి ఇవ్వకుండా కాలం గడుపుతూ వచ్చారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక కుటుంబంలో 18 ఏళ్లనిండిన మహిళలు ఎంతమంది ఉంటే అంతమందికి రూ.1500 చొప్పున ప్రతినెలా నగదు జమ చేస్తామన్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆర్‌టిసి బస్సు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన ఏలూరు నగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఒకటో పట్టణ ప్రాంతానికి చెందిన పోలనాటి శేషు స్థానికంగా డీమార్ట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి వద్ద నుంచి శుక్రవారం ఉదయం డిమార్ట్‌కు వెళ్లేందుకు సైకిల్‌పై బయలుదేరాడు. అతను వసంత మహల్ వంతెన సమీపంలో ఏలూరు రైల్వే వంతెన వైపునకు తిరుగుతున్న సమయంలో జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శేషు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై రెండో పట్టణ ఎఎస్‌ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పితాని కోడలు నాగ సాహితీ ప్రచారం

ప్రజాశక్తి పెనుగొండ

టిడిపి ఎన్నికల ప్రచారంలో పితాని కోడలు నాగ సాహితి పలు వార్డుల్లో ఇంటింటా తిరిగి టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మెయిన్ రోడ్డు మీదగా కాలనీలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సర్పంచి శ్యామల సోని, వార్డు మెంబర్లు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి గోవర్ధన్ ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి - పెనుగొండ

ఇంటింటా ప్రచారంలో వైసిపి ప్రభుత్వానికి అండగా నిలబడి, గెలిపించాలని జెడ్‌పిటిసి గోవర్ధన్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారంలో శుక్రవారం గోవర్ధన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని మరొకసారి ఆశీర్వదించాలని, మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. చెరుకువాడ ఎర్ర నారాయణస్వామి కాలనీ, అంబేద్కర్ కాలనీ ఇంటింటికీ తిరిగి ఓట్లు నమోనాతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సిఎం చేయాలి

వైసిపి నూజివీడు ఎంఎల్‌ఎ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - చాట్రాయి

వైసిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పోతనపల్లి, బూరుగు గూడెం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నవరత్నాల పథకాలు కొనసాగాలంటే జగనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. టిడిపి నాయకులు చెప్పే పథకాల అమలు సాధ్యం కాదని, ఆ నాయకుల మాటలు విని మోసపోవద్దని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల, కారంగుల శ్రీనివాసరావు, మిద్దె శివరామకృష్ణ, పుచ్చకాయల సుబ్బారెడ్డి, మిద్దె బాలకృష్ణ, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం సిపిఎం సభకు హాజరైన ప్రజలు

అందరికీ మేలు 'ఇండియా'తోనే సాధ్యం

(మొదటి పేజీ నుంచి)

కనుమూరి బాపిరాజు



బి.బలరాం

కెబిఆర్.నాయుడు

ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్‌ఎ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, పోలీసు బొమ్మ సెంటర్ మీదుగా ప్రకాశం చౌక్ వరకు సాగిన భారీ ప్రదర్శనలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని, టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను సాగనంపాలని చేసిన నినాదాలు హోరెత్తాయి. ప్రకాశం చౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అలుపెరగని పోరాటం పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించి ముఖ్యవక్తగా ప్రసంగించారు. ఈ సందర్భంగా నేతల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. దేశానికి, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న మోడీ విధానాలను ఎండగట్టడంతోపాటు మోడీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలుకుతున్న టిడిపి, జనసేన, వైసిపి అవలంబిస్తున్న ప్రమాదకర విధానాలను వివరించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఈ నాలుగు పార్టీలకు చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ దేశం, రాష్ట్రం భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలు ప్రస్తుతం జరుగుతున్నాయని, ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. లేకపోతే ఇవే చివరి ఎన్నికలని చెప్పారు. అధికారంలోకొస్తే ధరలు తగ్గిస్తామని చెప్పిన బిజెపి రెట్టింపు చేసిందన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. ఉపాధి హామీచట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. మోడీ దుర్మార్గాలను ఎండగట్టాలంటే ఇండియా వేదిక అధికారంలోకి రావాలన్నారు. నరసాపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు, భీమవరం ఎంఎల్‌ఎ అభ్యర్థి అంకెం సీతారాంతోపాటు జిల్లాలోని ఏడుగురు ఎంఎల్‌ఎ అభ్యర్థులను హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ మంత్రి కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ వామపక్షాలు కాంగ్రెస్‌తో కలిసి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 50 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పటికీ వామపక్షాలు అంటే తనకెంతో గౌరవమని చెప్పారు. సిపిఎం పదవుల కోసం కాకుండా ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు సిపిఎం చేస్తున్న పోరాటాలు అభినందనీయమన్నారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా కోసం సిపిఎం మాత్రమే నికరంగా నిలబడిందన్నారు. రాహుల్‌గాంధీ అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం పెడతానని చెప్పారన్నారు. నర్సాపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కెబిఆర్.నాయుడు మాట్లాడుతూ పదేళ్ల బిజెపి పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విపరీతమైన దాడి జరిగిందన్నారు. దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, సుమారు వెయ్యి చర్చిలపై దాడులు జరిగాయన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. జగన్ కూడా ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి మేనిఫెస్టో ప్రవేశపెట్టిందని, దీనిని అమలు చేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. నరసాపురం ఎంపీగా తనని గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి పాటుపడతానన్నారు. ప్రచారంలో సిపిఎం, సిపిఐ అందిస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీని, మతోన్మాద శక్తులను ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి నాయుడుకు అన్ని రంగాల్లోనూ అపూర్వమైన అనుభవం ఉందన్నారు. భీమవరం కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి అంకెం సీతారామ్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. ఉండి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి వేగేశ్న గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ దేశం మోడీ విధానాల ప్రమాదంలో ఉందని, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకుని ఇండియా వేదికకు పట్టం కట్టాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ నాటి స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో నేడు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ఈ సభలో మాజీ ఎంపీ మల్లాద్‌మినా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కె.పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, కె.రాజారామ్మోహన్‌రాయ్, కాంగ్రెస్ నాయకులు ఎస్.గంగయ్య, జెఎస్.రాజు, జెడి రాజ్‌కుమార్, భాషా పాల్గొన్నారు.

జెఎన్‌వి.గోపాలన్

వి.గోపాలకృష్ణంరాజు

ఎ.సీతారాం

సభలో అలుపెరగని పోరాటం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తాం

(మొదటి పేజీ నుంచి)

అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఏలూరు మీటింగ్ అదుర్స్ అంటూ ప్రశంసించారు. అంతా గెలుపే ధ్యేయంగా పని చేయాలన్నారు. చెత్తపై సైతం పెన్ను వేసిన దుర్మార్గుడు జగన్ అన్నారు. 13న మీరు వేసే ఓటుతో తాడేపల్లి ప్యాలెస్ బద్దలవ్వాలన్నారు. పోలవరాన్ని గోదావరిలో ముంచేశాడన్నారు. జిల్లాలవారీగా ఎబిసిడి వర్గీకరణ చేస్తానని ఎంఆర్‌పిఎస్ నాయకులకు హామీ ఇస్తున్నానన్నారు. అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం పెడతామన్నారు. హోంగార్డులకు రూ.18 వేల నుంచి రూ.25 వేలకు వేతనం పెంచుతామన్నారు. అంగన్‌వాడీ, ఆశ, స్కీమ్ వర్కర్లకు న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగులను అన్నివిధాలా అదుకుంటామన్నారు. ఉదయం పది గంటలకే ఓటు వేసేలా ప్రతిఒక్కరూ సిద్ధం కావాలన్నారు. ఏలూరులో శ్మశాన వాటికలో ప్లాష్ షెడ్డును కూల్చేశారని, ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈసారి ఇంకా బాగా పని చేసి అత్యంత సమర్థవంతమైన పాలన అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉండి సభలో అభివాదం చేస్తున్న నేతలు

నేటితో ప్రచారం బంద్

(మొదటి పేజీ నుంచి)

వస్తువులు, నగదు సీజ్ చేశారన్నారు. జిల్లాలో 1,744 పోలింగ్ స్టేషన్లకుగాను 1,069 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు పర్యవేక్షిస్తారన్నారు. జిల్లాలో 416 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించారన్నారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో లైవ్ టెలికాస్టింగ్ ఏర్పాటు చేశామని, మైక్రో అబ్జర్వర్‌లను నియమించినట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల ప్రధాన మండలంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ సామగ్రిని ఈ నెల 12వ తేదీ ఉదయం నుండే పోలింగ్ సిబ్బందికి అందిస్తారన్నారు. పోలింగ్ స్టేషన్లలో సిబ్బంది, ఓటర్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. దీనికోసం 150 ఆర్‌టిసి బస్సులు, 350 ప్రయివేట్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ అనంతరం ఇవిఎంలను ఏలూరు తరలించి స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరుస్తారన్నారు. సి-విజిల్ యాప్‌లో 661 ఫిర్యాదులు అందాయని, వాటిలో పరిష్కారానికి అర్హత కలిగిన 533 ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించామన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వందమంది వాలంటీర్లను తొలగించి, ఐదుగురు ఉద్యోగులు, తొమ్మిది మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో నాలుగు వేల మంది వాలంటీర్లు రాజీనామా చేశారన్నారు. జిల్లాలో ఇంతవరకు 15,615 మంది సిబ్బంది తమ ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారన్నారు. హోమ్ ఓటింగ్ ద్వారా 896 మంది కదలలేని పరిస్థితిలో ఉన్న వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారన్నారు. జిల్లాలో ఇంతవరకు 99.4 శాతం ఓటర్ల స్లిప్‌లను ఓటర్లకు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో జిల్లాలో 83 శాతం పోలింగ్ నమోదైందని, ప్రస్తుత ఎన్నికల్లో 90 శాతం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు నాలుగు వేల మంది భద్రతా సిబ్బందిని వినియోగిస్తున్నామని, వీరిలో వెయ్యి మంది పారా మిలట్రీ సిబ్బంది ఉన్నారన్నారు. పోలింగ్ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు. పోలింగ్ సమయంలో ప్రజలను రెచ్చకొట్టేవిధంగా, భయభ్రాంతులకు గురిచేసే వారిపై, హింసాత్మక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈసమావేశంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదాన ట్రస్ట్‌కు పాలకొల్లుకు చెందిన పెంకి వీర హనుమాన్ సూర్య శ్రీనాద శుక్రవారం రూ.50 వేల విరాళం అందించారు. ఈ సొమ్మును ఆఫీస్ సూపరింటెండెంట్ మెండే నర్సింహ స్వామికి అందించారు. వారికి స్వామి వారి ఫోటో, ప్రసాదాలు అందజేశారు.

ఓటర్లకు తాయిలాల ఎర..

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ అభ్యర్థుల ప్రచారం గడువు నేటితో ముగియనుంది. సుమారు నెలరోజులుగా ప్రచారాలతో ఊరెత్తించిన అభ్యర్థులు ఆఖరి అస్త్రంగా ఓటర్లకు తాయిలాల ఇస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంఎల్ఎ అభ్యర్థులు ఇంటింటికీ నగదు పంపిణీ చేపట్టారు. స్థానిక నాయకులతో పాటు వారికి నమ్మకస్తులైన వారిని ఈ పంపిణీకి వినియోగిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఒక్కొక్క ఓటరుకు రూ.1,500 చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఈ రెండు రోజుల్లోనూ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసేందుకు నాయకులు కృషి చేస్తున్నారు.

సంక్షేమ పథకాల ఘనత జగన్‌దే

రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్క రాష్ట్రం తెలంగాణలో నిలుపుదల చేయని పథకాలు ఎపిలోనే ఎందుకు నిలుపుదల చేస్తున్నారని అన్నారు. జగన్ సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున పెట్టి పేదరికం తగ్గించే విధంగా కృషి చేశారని తెలిపారు. జగన్‌పై బురద జల్లడం తప్ప చంద్రబాబుకు ఏ పని లేదన్నారు. జగన్ తిరిగి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిట్టూరి వెంకట సుబ్బారావు, మంగిన సూర్య పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - తణుకురూరల్

వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలే కాకుండా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా విసిగిపోతున్నారని తణుకు మాజీ ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి సమక్షంలో తణుకు నియోజకవర్గం, ఇరగవరం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరారు. రాధాకృష్ణ టిడిపి కండువా కప్పి స్వాగతం పలికారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ.. టిడిపికి సానుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి భారీ మెజార్టీతో గెలుపొందటం ఖాయమన్నారు. పార్టీలో చేరికలే ఇందుకు నిదర్శనమన్నారు. అసలైన అభివృద్ధి, సంక్షేమం టిడిపి కూటమితోనే సాధ్యమన్నారు. తణుకు అసెంబ్లీ నియోజకవర్గంలో సైకిల్ గుర్తుపై, నరసాపురం పార్లమెంటు స్థానంలో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేయాలని రాధాకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఊరొచ్చి ఓటేయండి..

రానుపోను ఛార్జీలు అందిస్తాం..

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు గెలిచేందుకు శత విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటూ ఎంతో కీలకం కావడం, పదులు, ఒకట్ల తేడాతోనే గెలుపోటములు ఉండడంతో ఓటరు లిస్టులో పేరున్న ప్రతి ఓటరు వద్దకు వెళుతున్నారు. వలస పోయిన వారి అడ్రస్ తెలుసుకుంటూ ఫోన్లు చేస్తున్నారు. పోలింగ్ కల్లా వచ్చి ఓటేస్తే రానుపోను ఖర్చులు భరిస్తామంటూ చెబుతున్నారు. వారు వచ్చేలా స్థానికంగా ఉన్న బంధువులతో మాట్లాడుతున్నారు. మున్సిపాలిటీ గ్రామ పంచాయతీ ఆయా వార్డుల్లో ఓటు ఉండి వలసపోయిన ఓటర్లకు గాలం వేస్తున్నారు. రెండు, మూడు నెలల కింద ఇతర ప్రాంతాలు, పట్టణాలకు వలస వెళ్లిన వారి వివరాలను ఓటరు లిస్ట్‌లతో సేకరిస్తున్నారు. ఇప్పటికీ ఆ ప్రాంతాల్లో అవగాహనా సదస్సు, ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. తాను గుర్తింపు పొందిన పార్టీ నుంచే బరిలో ఉన్నామంటూ వారి బంధువుల ద్వారా ఫోన్ చేయించి వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో ఓటుకు రూ.1000-2000 ఖర్చు చేసేందుకు కూడా వెనకాడడం లేదు. తమ బంధువుల ద్వారా ఫోన్ వివరాలు సేకరిస్తూ ఎవరు చెబితే ఓటు వేస్తారో వారితో చెప్పించి మరీ ఫోన్‌లు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వలస ఓటర్లను రప్పించేందుకు కొంత డబ్బును వారి ఇంట్లో ముట్టజెపుతూ ఓటు వేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎంతకైనా తెగించి మద్యం, డబ్బు ఎర చూపుతున్నారు. దీని కోసం ఓ పార్టీ అభ్యర్థులు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువ ఓట్లకు పైబడి ఉంటే ప్రత్యేక వాహనం కూడా ఏర్పాటు చేస్తామని వచ్చి ఓటు వేయాలంటూ వేడుకుంటున్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం చాలామంది తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు అనేక మంది వెళ్లారు. ఇక మన రాష్ట్రంలోనే తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో ఎంతోమంది ఉంటున్నారు. అలాంటి వారికి అభ్యర్థులు ఫోన్లు చేస్తున్నారు. అక్కడి నుంచి మీరంతా రండి. మీకు కావాల్సిన ఏర్పాట్లన్నీ మేమే చూసుకుంటాం. రవాణా ఖర్చులు భరిస్తామంటూ ఇప్పటికే కబురు పంపించారు. కుటుంబ సభ్యులను ప్రసన్నం చేసుకొని పిలిపించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఎలాగైనా ఓటేసి రావాలన్న తలంపుతో చాలామంది రావడానికి సుముఖత చూపుతున్నారు. ఓటింగ్ శాతం పెంచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల వెలువడిన ఎపి పాలిసెట్ ఫలితాల్లో మండలంలోని నెగ్గిపూడి మహాత్మా బాపూజీ రావు పూలే బాలుర సంక్షేమ(గురుకుల) పాఠశాల విద్యార్థి డి.అభయ్ 89 మార్కులతో స్టేట్ 2,889 ర్యాంక్ సాధించినట్లు ప్రిన్సిపల్ ఎం.పద్మ తెలిపారు. పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ క్వాలిఫై అయ్యారని అన్నారు. కాగా పెనుమంట్రలోని విజయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుంచి 16 మంది పాలిసెట్ రాయగా అందరూ క్వాలిఫై అయ్యారని, ఎ.మాన్విత 80 మార్కులతో స్టేట్ 5065 ర్యాంక్ సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ తేతలి సంజీవ రెడ్డి తెలిపారు.

అభయ్,
మాన్విత

మహోన్నత వ్యక్తి పివి రావు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - ఉండి

దళితులను ఐక్యంగా ఉంచేందుకు ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడును ఏర్పాటు చేసి, మహోద్యమాన్ని నడిపి, సుప్రీం కోర్టు ద్వారా వర్గీకరణను నిలుపుదల చేయించిన మహోన్నత వ్యక్తి పివి.రావు(పాములపర్తి విఘ్నేశ్వర రావు) అని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. ఉండి మండలం ఎన్ ఆర్ పి అగ్రహారంలో పివి.రావు 75వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నన్నేటి పుష్ప రాజ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న దళితుల వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఒక్క పిలుపుతో లక్షలాది మంది మాలలను ఏకం చేసి సచివాలయాన్ని ముట్టడిచేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్కసంగా ఆదేశాలు జారీ చేయగా పోలీసులు మాలలపై లాఠీలతో విరుచుకుపడ్డారన్నారు. భాష్ప వాయు గోళాలు ప్రయోగించటంతో పాటు గుర్రాలతో తొక్కించిన ఘటనలో ఇద్దరు మరణించగా వందల సంఖ్యలో కాళ్ళ, చేతులు విరగటం జరిగిందని, ఈ ఘటనలో పివి రావుకి కూడా చేయి విరిగి, దవడ ఎముక విరిగి తీవ్ర గాయాలు అయ్యాయని, ఉద్యమ క్రమంలో ఉద్యోగం పోయి ఎన్నో ఇబ్బందులు ఎదురైనా మడమ తిప్పక మాల జాతి ఆత్మగౌరవం కోసం పోరాడిన ధీరుడు పివి రావు అని పుష్ప రాజ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణ రాజు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నేతల సాల్మన్ రాజు, జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు తోర్లపాటి భాగ్యరాజ్ పాల్గొన్నారు.

సెలవులని విహారయాత్రలకు వెళ్లకండి..

ఓటుహక్కు వినియోగించుకోవాలి

నరసాపురం: ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. 11వ తేదీన రెండో శనివారం, 12న ఆదివారం, 13న ఎన్నికలు కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులకు సెలవులు. తిరిగి ఈనెల 14వ తేదీన ఆయా ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తాయని అధికారులు చెబుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రయివేట్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సొంతప్రాంతాలకు చేరుకుంటున్నారు. తెలంగాణా ఎన్నికల్లో వరుస సెలవులు నేపథ్యంలో అక్కడి ప్రాంతవాసులు ఓటింగ్‌కు దూరంగా ఉండి విహారయాత్రలకు వెళ్లారు. అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఉద్యోగులు ఓటింగ్‌కు దూరంగా ఉండడం సరికాదని, ఓటుహక్కు ఉపయోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.

శివ ఓట్లపై పందేల జోరు..

కోసు పందేనికి సై

ఆకివీడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పందేలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం పందేల జోరు ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి, మాజీ ఎంఎల్ఎ శివరామరాజుకి వచ్చే ఓట్లపై ఎక్కువగా ఓటర్ల దృష్టి పెడుతున్నారు. ఇతను సాధించే ఓట్లపైన రెండు పార్టీల గెలుపు ఓటమిలు ఆధారపడి ఉన్నాయని ఇక్కడ అందరి అభిప్రాయం. ఆ గెలుపు ఓటముల ఆధారంగానే పందేలు జోరు జరుగుతోందని చెప్పొచ్చు. శివరామరాజుకి వచ్చే ఓట్లు ఐదు వేల నుంచి 30 వేల వరకు పందేలు జరుగుతున్నాయి. డిపాజిట్ల పైన కూడా పందేలు జోరుగా సాగుతున్నాయి అంటే ఇక్కడ శివరామరాజుకి వచ్చే ఓట్ల సంఖ్య ఆధారంగానే మిగిలిన రెండు పార్టీలకి పోలయ్యే ఓట్లు హెచ్చుతగ్గులుంటాయి. శివరామరాజుకి 35 వేల ఓట్లు వస్తే మాత్రం వైసిపి కచ్చితంగా గెలిచే అవకాశం ఉందన్నది ఇక్కడ పందేంగాళ్ల మాట. అదే 20 వేలు దాటనట్లయితే టిడిపికే పూర్తి అవకాశాలు ఉంటాయన్నది పందేల్లో ఒక రకం. శివకు వచ్చే ఓట్లన్నీ టిడిపి నుంచే చేరుతాయని ఇప్పటివరకు అందరూ లెక్క కడుతున్నారు. అయితే మరో కొత్త లెక్క వచ్చింది. టిడిపికి చెందిన ఎందరో కార్యకర్తలు అధికార వైసిపికి మద్దతు పలికారు. వారు ఇప్పుడు శివకు ఓటేస్తారు కాబట్టి వైసిపి ఓట్లే చీల్తాయి అని టిడిపి వారు కొత్త లెక్క చెబుతున్నారు. మొత్తం మీద నాలుగంచల్లో ఈ పందేలు జరుగుతున్నాయి. రూ.5 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఈ పందేలు పలుకుతున్నారు. కోసు పందేలు కూడా జరగడం గమనార్హం. అయితే ఇక్కడ ఇంకా ప్రధాన అభ్యర్థుల గెలుపోటములు గప్‌చుప్ గానే ఉన్నాయి. ఈ నియోజకవర్గ టిడిపి కంచుకోట అయినప్పటికీ ముగ్గురు అభ్యర్థుల మార్పిడితో ఆ పార్టీలో ఇంకా గందరగోళ స్థితి కొనసాగుతూనే ఉందా అనే సందేహాలు వినిపిస్తున్నాయి.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

ద్వారకా తిరుమల: ద్వారకాతిరుమల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఉపాధి హామీ కూలీల వద్ద మండల టిడిపి నాయకులు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గ ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజుకి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని, అలాగే రాజమండ్రి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరికి కమలం గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. అనంతరం టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, బాబు వస్తేనే జాబు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి, మాజీ జెడ్‌పిటిసి ఏపూరి దాలయ్య పాల్గొన్నారు.

FORMAT –C1

DECLARATION ABOUT CRIMINAL CASES:

(As per the Judgment dated 25th September 2018 of the Hon'ble Supreme Court in W.P.(Civil) No.536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India and Anr)

Name and address of candidate : **GOTTUMUKKALA SHIVAJI**
Name of Political Party : **INDEPENDENT**
Name of Election : **General Election to House of People (Parliament)-2024**
*Name of Constituency : **09 - NARASAPURAM PARLIAMENT**

Sl. No	Name of Court	Case No. and date	Status of case(s)	
1.	Principal Junior Civil Judge cum Judicial First Class magis-trate, Palakol	FIR No. Cr. No. 38/2022 CC No. 27/2022 Poduru P.S W.G.Dt, AP	Case is Pending Trial Posted to 31-5-2024	The accused wrongly trespassed into the fields of LW-2, leased by LW-1, when the LW-1 questioned the Accused abused him in filthy language and assaulted him with a stick: on intervention of L Ws 3, 4 the Accused left from there. Therby guilty of the Accused estab-lished for the offence U/Sec 447, 324 IPC
2.	Principal Junior Civil Judge cum Judicial First Class magistrate, Palakol	FIR Cr. No. 352/2021 CC No. 155/2021 Poduru P.S W.G.Dt, AP	Case is Pending Trial Posted to 14-5-2024	Trespassed into his fields and destroyed the coconut Plantation worth of Rs. 25,000/- due to previous property disputes.
3.	Principal Junior Civil Judge cum Judicial First Class magistrate, Palakol	FIR Cr. No. 285/2021 CC No. 1561/2021 Poduru P.S W.G.Dt, AP	Case is Pending Trial Posted to 14-5-2024	Trespassed into his fileds and removed boundary stones

Sd/- GOTTUMUKKALA SHIVAJI

పోల్ డే మేనేజ్‌మెంట్ యాప్‌పై అవగాహన అవసరం

ఆర్ఒ, జెసి లావణ్యవేణి

ప్రజాశక్తి - దెందులూరు

మాట్లాడుతున్న లావణ్యవేణి

ఎన్నికల నిర్వహణకు నియమించిన సెక్టార్ అధికారులు పోల్ డే మేనేజ్‌మెంట్ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. దెందులూరు ఆర్ఒ కార్యాలయంలో నియోజకవర్గంలోని 23 మంది సెక్టార్ అధికారులకు పోల్ డే మేనేజ్‌మెంట్ యాప్‌పై శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, పోల్ డే మేనేజ్‌మెంట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పోలింగ్ ముందురోజు ఎన్నికల సిబ్బంది ఎన్నికల మెటీరియల్ తీసుకుని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బయలుదేరి పోలింగ్ కేంద్రాలకు చేరుకునే వరకు అన్ని విషయాలను పోల్ డే మేనేజ్‌మెంట్ యాప్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. పోలింగ్ రోజు ఈ నెల 13వ తేదీ ఉదయం ఆరు గంటలకు మాక్ పోల్ జరిపి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తరువాత ఎన్నికల పోలింగ్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభించి ప్రతి రెండు గంటలకు ఎన్ని ఓట్లు పోలయ్యాయో వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్ శాతాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. యాప్‌ను బిఎల్ఒలు, సెక్టార్ అధికారులు డౌన్‌లోడ్ చేసుకుని సదరు యాప్‌లో బిఎల్ఒలు పోలింగ్ కేంద్రాల జియో కోర్డినేటిస్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. పోలింగ్ రోజు ఇవిఎంలలో ఏవిధమైన సాంకేతిక సమస్యలు వస్తే యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే బెల్ కంపెనీ ఇంజినీర్లు పరిష్కరిస్తారన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రత సమస్య వస్తే యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. దీనిపై సంబంధిత సిబ్బంది వచ్చి పరిష్కరిస్తారన్నారు. శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, దెందులూరు తహాశీల్దార్ వరహాలయ్య పాల్గొన్నారు.

వైవాకలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ

భయాందోళనలో దళితులు

కన్నెత్తి చూడని పోలీసులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వైవాక పెదగరువు, మధ్య హరిజనవాడలో గత కొన్ని రోజులుగా ఇరు గ్రూపుల మధ్య ఘర్షణలు, కొట్లాటలు తరచూ జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఐకమత్యంగా ఉండాల్సిన దళితులు రెండు పార్టీలుగా చీలిపోయి సాయంత్రం వేళల్లో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నారు. ఎన్నికలు పురస్కరించుకుని మద్యం పుష్కలంగా దొరకడంతో మద్యం తాగి రెండు గ్రూపుల వారు దాడులు చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులపై మరో గ్రూపువారు దాడి చేసి గాయపరిచినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వారం రోజులుగా పెద గరువు, హరిజనవాడలో రెండు పార్టీలకు చెందిన వ్యక్తులు దాడులు చేసుకుంటూ కొట్టుకుంటున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తమ గ్రామం మండలానికి శివారు కావడంతో పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామానికి చెందిన కె.జోషి అనే దళిత నాయకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమే పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందన లేకుండా పోయిందని జోషి చెబుతున్నాడు. గ్రామంలో దళితులు అంత ఐక్యంగా ఉండేలా, దళితవాడలు ప్రశాంతంగా ఉండేందుకు, శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నాడు. ఎన్నికల పోలింగ్ ముగిసే వరకు సాయంత్రం వేళల్లో రెండు దళితవాడల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలు కాపాడాలని జోషి పోలీసులను కోరుతున్నాడు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

అబద్ధాలు, మోసాలతోనే మోడీ పాలన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

మాట్లాడుతున్న డేగా ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజలకు అబద్ధాలు చెబుతూ, మోసాలు చేస్తూ పాలన సాగిస్తున్న మోడిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్యను, సిపిఐ ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని కోరుతూ ఏలూరు నగరంలో డేగా ప్రభాకర్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరంలోని కొత్తపేట, చోడిదిబ్బ, తంగళ్లమూడి, ఆదివారపుపేట, పెన్షన్ లైన్, గన్‌బజార్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడి పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పలేక అయోధ్యలో రామాలయం నిర్మించామని, బాల రాముడు విగ్రహం ప్రతిష్టించామని, కాబట్టి ఓటు వేయండని అడుగుతున్నారన్నారు. మోడి గద్దెనెక్కిన నాటి నుంచి నేటి వరకు భారత ప్రజలకు అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. రైతుల ఆత్మహత్యలు నియంత్రిస్తానని, స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తానని చెప్పి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మేశారన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతుల ఉద్యమాలను అణిచివేశారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకొస్తే ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని బాహాటంగా మోడి చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపిలకు ఓటు వేస్తే బిజెపికి వేసినట్లే అవుతుందఅన్నారు. ఇండియా వేదికను గెలిపించడం ద్వారా భారతదేశ రాజ్యాంగాన్ని రక్షించాలన్నారు. రాష్ట్రంలో చెత్త మీద పన్ను వేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఎనిమిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచి రూ.40 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, సిపిఎం నాయకులు జగన్నాథం, మంచెల్ల ఇస్సాకు పాల్గొన్నారు.

అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం టౌన్ :రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావ్యణ్యను, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమట్ల ఎలిజాను గెలిపించాలని సిపిఎం, కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో జంగారెడ్డిగూడెం పార్టీ కార్యాలయంలో శుక్రవారం సభ నిర్వహించారు. సిపిఎం చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఎం.జీవరత్నం అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మద్దాల ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు రామ్‌సూరి, సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మండల కన్వీనర్ ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడారు. నియోజకవర్గంలోని సిపిఎం కార్యకర్తలంతా కాంగ్రెస్ ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసేందుకు చూస్తుందని, భారత రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటుందని, కార్మిక కర్షక వ్యవసాయ కార్మిక చట్టాలను రద్దు చేసే విధంగా భారత రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుందని చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ఇండియా వేదికగా ఏర్పడి బిజెపిని గద్దె దించటానికి ముందుకొచ్చాయన్నారు. అందుకనే రాష్ట్రంలో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐలు ఉమ్మడిగా పోటీ చేసి ప్రచారం చేస్తున్నాయన్నారు. ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కావూరి లావణ్య, చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థిగా ఉన్నమట్ల ఎలిజా పోటీ చేస్తున్నారని, వీరిని రానున్న ఎన్నికల్లో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో బూత్ స్థాయిలో ఏజెంట్లు కట్టుదిట్టంగా ఓట్ల కోసం కృషి చేయాలని కోరారు. వైసిపి, టిడిపి, జనసేనకు ఓట్లు వేస్తే బిజెపికి వేసినట్లేనన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలన్నా, పోలవరానికి ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల చట్టాల పరిరక్షణ, రైతులకు కనీస మద్దతు ధరలు తదితర అంశాలన్నీ అమలు కావాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇండియా వేదికతో దేశంలోనిచ రాష్ట్రంలోని ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీలు తాయిలాలతో ఓటర్లను కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రజలంతా ఈ తాయిలాలను వ్యతిరేకించి భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సక్రమంగా అమలు చేసి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు అదుపు చేసే ఇండియా వేదిక అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. ఈ సభలో సిపిఎం నాయకులు అందుగుల ప్రభాకరరావు, జోడే సూర్యచంద్రరావు, యాగంటి సీత, పటాన్ మస్తాన్, వంగా గోపీ, మాబు సుభాని, కె.సుబ్బారావు, వామిశెట్టి నరసరావు పాల్గొన్నారు.

మా ఇంట్లో ఓట్లు అమ్మబడవు

కామవరపుకోటలో ఓ ఇంటికి ఫ్లెక్సీ ఏర్పాటు

ఇంటికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రజాశక్తి - కామవరపుకోట

ఎన్నికల్లో అనేక రాజకీయ పార్టీల వారు ఓటర్లను కొనుగోలు చేయటానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఓటర్ స్లిప్పులతో పాటు డబ్బు, మద్యం, బహుమతులు వంటివి అందించి తమ పార్టీలకు ఓట్లు వేయమని అభ్యర్థిస్తుంటారు. అయితే కామవరపుకోటకు చెందిన వీరమల్ల మధు కుటుంబ సభ్యులు తమ ఓటును తప్పకుండా వేస్తామని, కాని ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు అని తమ ఇంటి ఎదురుగా బ్యానర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కూడా ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు వేయని వారిని ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తే తప్పనిసరిగా ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. ఏ ప్రభుత్వం వారైనా సరే వృద్ధులకు పెన్షన్ అందించడంతో పాటు ఉచిత విద్య, ఏ ఆసుపత్రికి వెళ్లినా ఉచిత వైద్యం అందిస్తే ప్రజలకు ఇతర పథకాలు అందించాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం మధు వ్యక్తం చేశారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

ఏలూరు పార్లమెంటరీ ఎన్నికల వ్యయ పరిశీలకులు బూటియా

వాహనాల తనిఖీలో బూటియా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని ఏలూరు పార్లమెంటరీ ఎన్నికల వ్యయ పరిశీలకులు టి.జోర్డాన్ బూటియా తెలిపారు. జీలుగుమిల్లి మండలంలోని తాటియాకులగూడెం వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సరిహద్దు గుండా రాష్ట్రంలోకి వస్తున్న వాహనాల తనిఖీ తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయంపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో సిబ్బంది పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే, కేసులు నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యయ పరిశీలకులు శివనాగరాజు, చెక్ పోస్ట్ సిబ్బంది ఉన్నారు.

రూ.2.60 లక్షలు స్వాధీనం

కామవరపుకోట :కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఒక వ్యక్తి వద్ద నుంచి ఎటువంటి ఆధారాలు లేని రూ.2.60 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చెక్‌పోస్ట్ అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. ఈ నగదు గాలాయగూడేనికి చెందిన వ్యక్తి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేయనున్నట్లు చెప్పారు. నగదుకు సంబంధించిన తగు పత్రాలను చూపిస్తే తిరిగి ఇస్తామన్నారు. వాహనాల తనిఖీల్లో పోలీసు సిబ్బంది కె.రమేష్, కె.రామకృష్ణ, సూర్యరావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, వీడియో గ్రాఫర్లు వీరమల్ల మధు, సౌజన్‌సాయి పాల్గొన్నారు.

నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

తాయిలాల పంపిణీ

నరసాపురం : ఎన్నికలు చివరి దశకు చేరడంతో ప్రధాన పార్టీలు తాయిలాల పంపిణీ ముమ్మరం చేశాయి. నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే చాలా గ్రామాల్లో డబ్బులు పంచారు. ఇప్పటివరకూ ప్రచారం చేసిన నాయకులు ప్రచారం ముగింపు దశకు చేరుకోవడంతో ఒక ప్రధాన పార్టీ రూ.1500, ఓ పార్టీ రూ.వెయ్యి పంపిణీ చేసినట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో మద్యం కూడా పంపిణీ చేస్తున్నారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలకు నియోజకవర్గంలో ఓటరుకు రూ.2500 ముట్టాయి. కొన్ని ప్రాంతాల్లో నగదు పంపిణీ చేయడానికి బయట నియోజకవర్గంలోని మనుషులను నియమించారు.